మహిళామణులే నిర్ణేతలు..

- పేట నియోజకవర్గంలో కీలకంగా మారిన మహిళా ఓటర్లు
- సంక్షేమ పథకాలపై సానుకూలతే ఓటుగా తీర్పు
- పురుషుల కంటే పెరిగిన మహిళా ఓటర్లు
- నియోజకవర్గంలో 89.88 పోలింగ్ శాతం



కంభంపాడులో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు(ఫైల్)

పెనుగంచిప్రోలు: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పురుషులతో పోలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ పెరిగిన మహిళా ఓటర్లు మరోమారు అధికార వైఎస్సార్ సీపీకి పట్టం కట్టనున్నారని విశ్లేషకులు అంటున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఓటింగ్ శాతం ఎన్నడూ లేనివిధంగా 89.88 నమోదైంది. దీనిలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తం నియోజకవర్గంలో 2,05,364 మంది ఓటర్లు ఉండగా 1,84,575 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 88,667 కాగా స్త్రీలు 95,904 మంది కాగా ఇతరులు నలుగురు ఉన్నారు.

పెద్ద సంఖ్యలో ఓటర్లు..

పోలింగ్ జరిగే సమయంలో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఓ మోస్తరుగా పోలింగ్ కేంద్రాలకు వస్తారు. సాయంత్రం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రారు. అయితే సోమవారం జరిగిన పోలింగ్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు చాలా కేంద్రాల్లో క్యూలు కనిపించాయి. గ్రామాలతో పాటు పట్టణ పరిధిలో కూడా ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. సాయంత్రం 6 గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకోవటానికి అధికారులు అవకాశం కల్పించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం 0.24 పెరిగింది.

మహిళలే కీలకం...

జగ్గయ్యపేట నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరగటంపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందులోనూ మహిళా ఓటర్లు పోటెత్తటం ఇక్కడ ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి విజయంలో కీలక పాత్ర పోషిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎండలను సైతం లెక్క చేయకుండా క్యూలలో వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో రావటం వెనుక ప్రభుత్వం నుంచి అందుకున్న సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ సీపీ పక్షాన నిలబడాలని తీర్పు ఇవ్వడానికేనని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు, యువత, పురుషులు సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశ్వసిస్తుండటంతో పాటు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను చేస్తున్న సేవా కార్యక్రమాలు అండగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఫలితాలపై ఉత్కంఠ...

పోలింగ్ పూర్తవటంతో ఇక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదలైతే మే 13న పోలింగ్ పూర్తయింది. అయితే ఫలితాలు మాత్రం జూన్ 4న వెలువడనున్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని దశల పోలింగ్ పూర్తయిన తరువాత ఫలితాలు వెల్లడించడంతో అటు అభ్యర్థులు...ఇటు ప్రజలు మరో 18 రోజులు వేచి చూడక తప్పదు.

ఓటుకు పోటెత్తిన మహిళలు

వత్సవాయి: ఈ నెల 13 న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మహిళామణుల ఓట్ల శాతం ఎక్కువగా నమోదైంది. మండలంలో మొత్తం 90.18 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 50,017 ఓట్లు ఉండగా వాటిల్లో పురుషులు 24,060, మహిళలు 25,957 మంది ఉన్నారు. మొత్తం ఓట్లు 45,105 ఓట్లు నమోదు కాగా వాటిల్లో పురుషులు 21,586 మంది, 23,519 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు కంటే మహిళలే ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు వచ్చి బారులు తీరిన మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న తరువాతే పోలింగ్ స్టేషన్ నుంచి అడుగు బయటకు పెట్టారు. సాయంత్రం ఆరు గంటలకు వరకు ఓటు వేసే అవకాశం ఉండగా కొన్ని గ్రామాల్లో నిర్ణీత సమయంలో ఓటింగ్ కాగా మక్కపేట, వత్సవాయి, దబ్బాకుపల్లి, మంగొల్లు వంటి గ్రామాల్లో 6 గంటలు దాటిన తరువాత కూడా ఓటింగ్ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ఉదయాన్నే బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజలు శాంతియుతంగా ఉండాలి



పెనుగంచిప్రోలు: నియోజకవర్గ ప్రజలు శాంతియుతంగా ఉండాలని డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని శివాపురం గ్రామంలో జరిగిన ఘర్షణలకు సంబంధించి గురువారం గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఇరు పార్టీల నేతలతో సమావేశం జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎన్నికలకు ముందు మాదిరిగా శాంతియుతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం కలుషితం కాకుండా సహకరించాలని కోరారు. నందిగామ ఏసీపీ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ పి.రాంబాబు, ఏఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుడికి సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 10+2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ఆర్చరీ క్రీడాకారుడు భూటాన్ గ్రాండ్ ఫిక్స్–2 విజేత పెండ్యాల త్రినాథ్ చౌదరి గురువారం అధ్యాపకుడు పులుగు దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్చరీ శిక్షణలో బిజీగా ఉన్న తనకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి సీబీఎస్ఇ 10+2 పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించటానికి సహకరించారని తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన భూటాన్ గ్రాండ్ ఫిక్స్–2 పోటీల్లో విజేతగా నిలిచిన ఆర్చరీ క్రీడాకారుడు పెండ్యాల త్రినాథ్‌చౌదరిని, పులుగు దీపక్‌ను సత్కరించి అభినందించారు.

క్లుప్తంగా

నాయకులతో మాటా మంతీ



జగ్గయ్యపేట: ఓట్ల పండుగ ముగియటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి సామినేని ఉదయభాను స్వగృహంలో గురువారం పలు గ్రామాల నాయకులతో మాటా మంతీ నిర్వహించారు. పలు గ్రామాల నాయకులు ఉదయభానును కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పోలింగ్ సరళిని నాయకులను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల నాయకులు ఈ సారి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

జుజ్జూరు(వీరులపాడు): రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా, సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు విధిగా స్టాక్ రిజిష్టర్లను నమోదు చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): వేసవి కాలంలో ప్రజలు, పాదచారులు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆసిష్ కుమార్ శ్రీవత్సవ పేర్కొన్నారు. గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ముగిసే వరకు గ్రామంలో చలివేంద్రం కొనసాగుతుందన్నారు. ఈ చలివేంద్రంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తారన్నారు. అనంతరం జయంతిపురంలోని గిరిజన మహిళలకు రూ.75 వేల విలువ చేసే గిరిజన సాంప్రదాయ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మూర్తిరావు, జీఎం ఫరూక్ మహ్మద్, సీనియర్ డీజీఎం రామకృష్ణసాయి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూక్యా శ్రీరాములు నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన బాబా మందిర వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులోని శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు వలివేటి శ్రీనివాస శర్మ బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాబావారిని ఉంచి సముద్రవేణి కోలాట మహిళా బృందం కోలాట నృత్యాలతో ఊరేగింపు భిక్షాటన చేశారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం లలితా పరమేశ్వరి ఆధ్వర్యాన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, అధ్యక్షుడు వైవీ శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు, కె.శ్రీనివాస్ కోనేరు మంజులవాణి తదితరులు పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆలరించింది. సీనియర్ గాయకుడు బాలాజీ కుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు సుధారాణి, లక్ష్మీదుర్గ, దుర్గ, నాగలక్ష్మి, గెల్లి సువర్ణ, బోయిన వేణుగోపాల్, గాయత్రి శర్మ, విజయశ్రీ గుప్తా తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. బాలాజీ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

నందిగామలో ఫ్యాన్‌దే హవా

- డాక్టర్ జగన్‌మోహన్‌రావు విజయం తథ్యం
- సౌమ్యకు రెండో సారి పరాభవం తప్పదంటున్న పరిశీలకులు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న మహిళలు(ఫైల్)

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో ఫ్యాన్‌దే హవా అని పరిశీలకులు భావిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయం తథ్యమని అంచనా వేస్తున్నారు. డాక్టర్ జగన్‌మోహనరావు 2019లో 10,800 పైచిలుకు ఓట్లతో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యపై గెలుపొందారు. డాక్టర్ జగన్‌మోహనరావు, సౌమ్యలు ఒకే కులానికి చెందిన వారయినప్పటికీ సౌమ్య కన్నా జగన్‌మోహనరావు అన్ని మండలాల్లో మంచి పట్టున్న నాయకుడు. జగన్‌మోహనరావు వైద్య వృత్తిలో కొనసాగుతున్నప్పటికీ ఒక పక్క ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన అన్ని పనులు చేస్తూ మరో పక్క నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాడు. అంతేకాక అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఉంటాడు. సౌమ్య రెండు సామాజిక వర్గాల్లో మాత్రమే పట్టున్న నాయకురాలు.

రాత్రి 11 గంటల వరకు పోలింగ్

నందిగామ నియోజకవర్గంలో 2,05,480 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 99,398 మంది, మహిళలు 1,06,076, ఇతరులు ఆరుగురు ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారు 1,80,076 వారిలో పురుషులు 87,847 మంది, మహిళలు 92,225మంది, ఇతరులు 4, నందిగామ నియోజకవర్గంలో 87.64 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 11 గంటలయినా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్నారు. మహిళల ఓట్లు పెరగటంతో డాక్టర్ జగన్‌మోహనరావు విజయానికి కలసి వస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మహిళల కోసం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పెన్షన్‌లతో వైఎస్సార్ కాపు నేస్తం అనేక సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలనే మహిళలు భారీగా తరలివచ్చి గంటల తరబడి క్యూ లైన్లో నిలబడి ఓటు వేసారనే చర్చ జరుగుతుంది.

నవ నందిగామ పేరిట అభివృద్ధి..

నవ నందిగామ పేరిట నందిగామను ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లు ఇద్దరు ఎంతో అభివృద్ధి చేశారని విశ్లేషకులు అంటున్నారు. నందిగామ గాంధీ సెంటర్‌లో నవ నందిగామ పేరిట చేసిన అభివృద్ధి, రామన్నపేట, చందర్లపాడు రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు, సీఎం రోడ్డు విస్తరణ చేపట్టంతో పాటు 60 వేల జనాభా ఉన్న నందిగామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా 30 కిలోమీటర్ల మేర చందర్లపాడు మండలం ఉస్తేపల్లి కృష్ణానది నుంచి తాగునీటిని నందిగామకు తీసుకువచ్చిన ఘనత డాక్టర్ జగన్‌మోహనరావుకే దక్కిందని ప్రజలు తెలుపుతున్నారు. అంతేకాకుండా నందిగామలో 100 పడకల ఆస్పత్రి, కేంద్రియ విద్యాలయం, కంచికచర్లలో మహిళా డిగ్రీ కళాశాల, కంచికచర్ల నుంచి తెలంగాణా రాష్ట్రానికి వెళ్లే పెద్దాపురం వరకు రూ.18 కోట్లతో రోడ్లు వేయించటం, 40 ఏళ్ల నుంచి పరిష్కారం కాని ఏ ప్రభుత్వం చేపట్టనటువంటి కంచికచర్ల వసంతకాలనీ, ఇందిరాకాలనీ, మోడల్‌కాలనీ ఇళ్లపై 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడిన జగన్‌మోహనరావును కంచికచర్ల పట్టణ ప్రజలు గుండెల్లో గూడు కట్టుకున్నారు. అన్ని విధాలుగా నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుకే ప్రజలు తిరిగి పట్టం కడతారని విశ్లేషకులు, పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



పేటలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రమణ, గ్రంథాలయాధికారి ప్రభ



కంచికచర్ల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో జూన్ 7వ తేదీ వరకు జరగనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను పెనుగంచిప్రోలు మండలం, కొనకంచి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రమణ ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ 23 రోజుల పాటు నిర్వహించనున్న విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞాన శిబిరానికి వచ్చి అనేక కొత్త విషయాలను తెలుసుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ మాట్లాడుతూ.. స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, తెలుగు దస్తూరి తదితర అంశాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఏర్పాటుచేయనున్న ఉచిత శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రేణుక, గ్రంథాలయ సిబ్బంది జె.శ్యామల, రమేష్, సత్యావతి, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక భాండాగారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కంచికచర్ల: వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞా న శిబిరంలో గురువారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రుడు మాట్లాడుతూ.. ఈ సదస్సుల్లో పుస్తక పఠనం, కథలు వినుట, పుస్తక సమీక్షలు, పెద్దలు నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా కార్యక్రమాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వి ద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ప్రముఖ రచయిత సర్వేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయంపై జోరుగా బెట్టింగులు

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు
- మెజార్టీలపైనే పందేలు
- చేతులు మారనున్న కోట్లాది రూపాయలు

జగ్గయ్యపేటఅర్బన్: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. ఇక అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం బాక్సుల్లో భద్రం అయింది. సోమవారం రాత్రి వరకు పోలింగ్ పోరులో నిమగ్నం అయి రాజీలేని రాజకీయ పోరాటం చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా మంగళవారం ఉదయం నుంచే లెక్కలు కట్టే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం నుంచి ప్రతి ఇద్దరి మధ్య జగ్గయ్యపేటలో ఎవరు గెలుస్తారు, ఎంత మెజార్టీ వస్తుంది, ఏ గ్రామంలో పోలింగ్ ఎలా సాగింది. అభ్యర్థుల్లో అనుకూల పవనాలు ఎవరివైపు వీస్తున్నాయన్న చర్చలే సాగుతున్నాయి. బస్సుల్లో, ఆటోల్లో, సెలూన్లలో, హోటళ్లలో ఇలా ప్రతి చోట అందరి నోట ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాల పైనే సుదీర్ఘ చర్చలు సాగుతున్నాయి. ఎవరి స్థాయిలో వారు తమకు తెలిసింది, అక్కడ ఇక్కడ విన్న గాసిప్స్ అన్నీ కలిసి తన వాదనే నిజం అని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

5 ఎకరాలు పందెం కాసిన వైనం....

ఇటు అధికార వైఎస్సార్ సీపీ, అటు ప్రతిపక్ష తెలుగుదేశం వర్గాల మధ్య కొన్ని గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు సాగుతుంది. కొందరు పిఠాపురం మీద, కొందరు మంగళగిరి, కడప అభ్యర్థుల గెలుపు పందేలు కాస్తుండగా, మరి కొందరు స్థానిక అభ్యర్థులపై పందేలు ఒడ్డుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆసక్తిగా తమ గ్రామాల్లో పార్టీలు సాధించే మెజారీలపై పందేలు కాస్తున్నారు. ఉదాహరణకు జగ్గయ్యపేట పక్కన ఉన్న ఒక గ్రామంలో గత ఎన్నికల్లో వచ్చిన దానికంటే ఒక్క ఓటైనా ఎక్కువ సాధిస్తామని ఒక పార్టీకి చెందిన సర్పంచ్ 5 ఎకరాల పొలాన్ని పందెంలో కాశాడు. దీంతో క్రమంగా రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. గ్రామాల వారీగా, బూత్‌ల వారీగా పోలైన ఓట్లు ఆయా గ్రామాల రాజకీయ పరిస్థితులపై తమ బంధువులు, స్నేహితులు, తమ పార్టీల మనుషుల ద్వారా సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆరాటపడుతున్నారు.

మెజార్టీలపై ఊహాగానాలు..

జగ్గయ్యపేటలో మెజార్టీ సాధిస్తామంటూ రెండు పార్టీల నేతలు గట్టిగా చెబుతున్నారు. ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. జగ్గయ్యపేటలో మరొక దఫా అధికారం మాదేనని, సైలెంట్ ఓటింగ్ జరిగిందని, మహిళా ఓటర్లంతా తమకు అండగా నిలిచారంటూ వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతం పరిస్థితి మార్చేస్తాం, గట్టి మెజార్టీ సాధిస్తామని టీడీపీ వారు చెబుతున్నారు. దీంతో పార్టీల నేతలంతా గ్రామాల్లో ఉన్న తమ నాయకుల ద్వారా సమాచారాన్ని రాబట్టుకొని బూత్‌ల వారీగా తమకు పోలైన ఓట్లు లెక్కలు కట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



నందిగామ: నందిగామ పట్టణంలో నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ట్యాంకర్ల నీరే దిక్కయ్యాయి. పట్టణ పరిధిలో దాదాపు 50 వేలకు పైగా జనాభా వున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు మూడు బోర్ల నుంచి నీరు అందుతాయి. ఈ క్రమంలో కీసర వద్ద ఒక బోరు మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో గత కొద్దిరోజులుగా పట్టణంలో పైపులైన్ల ద్వారా తాగునీరు అందడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా అధికారులు ట్యాంకర్ల ద్వారా అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలినిని వివరణ కోరగా పట్టణ పరిధిలో తొమ్మిది ట్యాంకర్ల ద్వారా అన్ని ప్రాంతాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా అందిస్తున్నామన్నారు. గురువారం నుంచి పైపులైన్ల ద్వారా కూడా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ప్రమాదాలకు నెలవుగా జాతీయ రహదారి




అంబారుపేటలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం

నందిగామ: జాతీయ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారుతోంది. ముఖ్యంగా నందిగామ మండలం అంబారుపేట ప్రాంతంలో ఇటీవల 65వ నంబర్ జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని అంబారుపేట, ఐతవరం గ్రామాలు జాతీయ రహదారికి ఇరువైపులా అనుకొని ఉంటాయి. ఈ క్రమంలో గ్రామస్తులు నిత్యం జాతీయ రహదారి దాటాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో జాతీయ రహదారి దాటుతూ అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల 5న హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న వారిలో ఇద్దరు మహిళలు సత్యమ్మ అమ్మవారికి కొబ్బరికాయ కొట్టేందుకు అంబారుపేటలో దిగి రోడ్డు దాటుతున్న సమయంలో మరో కారు ఢీకొనడంతో ఆ ఇద్దరు మహిళలు మృతి చెందారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీన అదే ప్రాంతంలో జాతీయ రహదారి దాటుతున్న సమయంలో అంబారుపేటకు చెందిన ఓ వృద్ధుడిని ఓ మినీ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇవి కాక గతంలో కూడా ఆయా గ్రామాలకు చెందిన వారు ఇప్పటికే పదుల సంఖ్యలో మృతి చెందారు. ఇంత జరుగుతున్న ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి పెట్టలేదని స్థానికులు వాపోతున్నారు.


రాత్రి వేళల్లో ప్రమాదాలు..

జరుగుతున్న ప్రమాదాలు ఎక్కువ శాతం రాత్రి సమయంలోనే జరుగుతున్న నేపథ్యంలో జాతీయ రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ హనీష్‌ను వివరణ కోరగా ప్రమాదాలను నివారించేందుకు గతంలోనే బారికేట్లు ఏర్పాటు చేసినప్పటికీ కొందరు వాహన చోదకులు అతివేగంగా రావడం వలన రోడ్డు దాటుతున్న వారు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ముఖ్యంగా స్వచ్ఛందంగా పలుచోట్ల లైట్లు కూడా ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఇక పూర్తిస్థాయిలో రెండు గ్రామాల పరిధిలో జాతీయ రహదారి వెంట వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సంబంధిత నిర్వాహకుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని చెప్పారు.

శృతిలయ సమన్వితం... త్యాగరాజ సంకీర్తనం




త్యాగరాజ కృతులను గానం చేస్తున్న శర్వాణి



సంగీతోత్సవంలో భక్తిగా త్యాగరాజ కృతులను గానం చేస్తున్న రఘునాథరావు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీతసభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు కచేరీలో పాల్గొని ఉత్సవాలకు శోభను అందిస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో కె.శర్వాణి, శృతిలయ నివాస్ విద్యార్థులు, మంత్రప్రగడ దుర్గా ప్రమీల, కె.శ్రీవిద్య, కె.అనిల్‌కుమార్ డీవీఆర్ సీత, పోపూరి శ్యామసుందర్, వీరుభట్ల సీతారమణి, గందూరి లక్ష్మీ హర్షిత, సాయి కృష్ణ కౌశిక్, ముళ్ళమూడి శ్రీనిధి, విష్ణుభొట్ల సోదరీమణులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. కేఎస్ గోవిందరాజన్ వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. సంగీతోత్సవంలో 6 సంవత్సరాల శర్వాణి నుంచి 85 సంవత్సరాల రఘునాథరావు పాల్గొనటం విశేషం. సంగీత కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం వైశాఖ మాసం పురస్కరించుకుని సాయినాధుడు, శ్రీ మరకత పోలిన శ్రీ భవానీ శంకర స్వామి వారికి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి చేతులమీదుగా మామిడి పండ్ల రసంతో అభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు మామిడి పండ్లు తీసుకొచ్చి మామిడి పండ్ల రసంతో బాబా వారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ ఏటా తాము లోక కళ్యాణార్థం భక్తులు, దాతల సహకారంతో వైశాఖ మాసంలో బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందిర సంయుక్త కార్యదర్శి విష్ణు వర్ధన్ కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.